క్లుప్తంగా

'లొంక'ను దర్శించుకున్న సీపీ



సిరికొండ: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శైవపుణ్య క్షేత్రం లొంక రామలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో సైకత లింగానికి సీపీ పూజలు చేశారు. పురోహితులు దండాల నాగరాజుశర్మ సీపీకి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజల అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. దట్టమైన అడవుల్లో కొలువైన ఆలయం చాలా మనోహరంగా ఉందని సీపీ పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సీపీని ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు అవదూత గంగాధర్, దాసరి మారుతి, బడాల సంతోష్, ప్రశాంత్, బిసీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



డిచ్‌పల్లి: మండలంలోని మెంట్రాజ్‌పల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా దంతవైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేసీఐ ఆధ్వర్యంలో యోగా శిక్షణ



నిజామాబాద్ నాగారం: జేసీఐ వారోత్సవంలో భాగంగా గురువారం ఆరోగ్య రక్ష నేచర్ క్యూర్ యోగా ట్రైనర్ డాక్టర్ ఐశ్వర్య ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిబిరం నిర్వహించారు ఇందులో రోజువారీ జీవితంలో యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. డాక్టర్ ఐశ్వర్య మాట్లాడుతూ.. యోగా శరీరాన్ని బలపరచడమే కాకుండా, మనసును పదునుగా మారుస్తుందని అన్నారు. కార్యక్రమంలో జేసీఐ ఇందూరు అధ్యక్షురాలు గౌతమి, సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 17 వరకు పోరాట వారోత్సవాలు నిర్వహిస్తాం



నిజామాబాద్ సిటీ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విశిష్టతను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఈనెల 10 నుంచి 17 వరకు పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలో సదస్సులు, చర్చ గోష్ఠుల ద్వారా ప్రచార క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నూర్జహాన్, సుజాత, వై గంగాధర్, నరేశ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియన్ సివిల్ సర్వీసెస్ టోర్నీకి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించిన స్టేట్ లెవెల్ ఆల్ ఇండియన్ సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ పోటీలలో నిజామాబాద్ జిల్లా నుంచి గడల అనిత ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైంది. ఈసందర్భంగా అనితకు జాగిర్యాల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	114,200	వెండి(కిలో)	1,32,000
22 క్యారెట్స్	105,450	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	180	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	30	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	80
బీరకాయ	40	80	దోసకాయ	20	40
దొండకాయ	40	80	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	70	140	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	60
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	50	100	కరివేపాకు	40	80
మెంతికూర	60	110	చామగడ్డ	30	60
కొత్తిమీర	40	80	చిక్కుడుకాయ	50	90
పుదీనా	40	80	గోరుచిక్కుడు	50	90
క్యాప్సికం	40	80			

–సుభాష్‌నగర్

మారిన బడి స్వరూపం

- ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన
- బ్లాక్ బోర్డుపై ఖర్చుల వివరాల ప్రదర్శన
- ఖలీల్‌వాడి పాఠశాల ప్రత్యేకత



ఖలీల్‌వాడి ఉన్నత పాఠశాల



డిజిటల్ బోర్డులపై బోధన చేపడుతున్న ఉపాధ్యాయులు



బ్లాక్ బోర్డుపై నిధుల వినియోగ వివరాలు

నిజామాబాద్‌అర్బన్: ఒకప్పుడు విద్యార్థులు తక్కువ.. సమస్యలు ఎక్కువగా ఉండే ప్రభుత్వ పాఠశాల అది ప్రస్తుతం రెండేళ్లలోని పాఠశాల స్వరూపం మారిపోయింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,దాతల సహకారంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు సమస్యలు కూడా వేగంగా పరిష్కారమయ్యాయి. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో ఉన్న ఖలీల్‌వాడి పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న ఖలీల్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 402 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో పంది మంది టీచర్లు ఉన్నారు. పాఠశాలలో విద్యార్థులకు బ్లైజర్ దుస్తులు అవలంభిస్తున్నారు. ప్రతి తరగతి గదిలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. తరగతి గదిలోను టీఎల్‌ఎంఎల్ మేళ ద్వారా నిర్వహించే వివిధ బొమ్మలు, వస్తువుల ద్వారా రూపొందించిన చిత్రాలు, పాఠ్యాంశాలు తొందరగా అర్థమయ్యేలా ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థికి దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రతిరోజు భోజనం పరిశీలన, కోడిగుడ్లు ప్రతి విద్యార్థికి అందేలా ఓ టీచర్‌కు ఇన్‌చార్జిగా కేటాయించారు. రెండేళ్ల క్రితం 150 లోపు ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం ఏకంగా 402 మంది విద్యార్థులకు చేరింది. అదనపు గదులకు మరమ్మతులు చేయించి ప్రతి గదిలో బెంచీలు, ఫ్యాన్లతో పాటు ఇతర సామగ్రిని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉండే డెస్క్ విధానాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతి వారం టెస్టులు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని అంచనా వేసి వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. దీని కోసం వంతుల వారిగా టీచర్లు విధులు కేటాయిస్తున్నారు.

విరాళాల సేకరణ

పాఠశాలకు సంబంధించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు పాఠశాల టీచర్లు, తమకు తెలిసిన వారితో, స్థానికులచే విరాళాలను సేకరిస్తున్నారు. సేకరించిన విరాళాలను ఏఏ పనులకు వినియోగించారు, ఎంత బడ్జెట్ మిగిలింది అనే విషయాలతో బ్లాక్ బోర్డ్ పై ప్రదర్శిస్తున్నారు. అలాగే విద్యాశాఖ నుంచి ప్రతి ఏటా ఎన్ని నిధులు వస్తున్నాయి, ఎన్ని ఖర్చు చేస్తున్నారు, పనుల వివరాలతో సహా బ్లాక్ బోర్డులపై ప్రదర్శిస్తున్నారు.

టీచర్ల కొరత

పాఠశాలలో టీచర్ల కొరత నెలకొంది. 402 మంది విద్యార్థులకు కేవలం పది మంది టీచర్లు మాత్రమే కొనసాగుతున్నారు. 25 మంది టీచర్లు అవసరం ఉండగా 10 మంది ఉన్నారు. మరో నెల రోజుల్లో మరో ముగ్గురు టీచర్లు రిటైర్మెంట్ కానున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను కేటాయించాలని పాఠశాల టీచర్లు కోరుతున్నారు.

మెరుగైన విద్య అందిస్తాం



విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రధాన లక్ష్యం. ఇందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నాం.టీచర్లతో కలిసి విద్యార్థులకు ఎలాంటి విద్య కావాలో నిర్ణయం తీసుకుంటున్నాం. విద్యార్థులకు మౌలిక సదుపాయాల ఏర్పాటు, మంచి విద్యా బోధన, మంచి భోజనం అందిస్తున్నాం.

– షేక్ అమీర్, హెచ్‌ఎం

మురుగు పారే దారేదీ!



జనావాసాల మధ్య నిలిచిన మురుగు నీరు

సిరికొండ: డ్రెయినేజీలు లేక మురుగు నీరు జనావాసాల మధ్యే పేరుకుపోతుండటంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షస్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని హన్మ్యానాయక్ తండాలో మురుగు నీరు, వర్షం నీరు రోడ్ల పైనే పేరుకుపోతుండటంతో నడవలేకపోతున్నామని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగు రోడ్లపై నిలుస్తోంది. మురుగు నీటికి వర్షం నీరు తోడవడంతో రోడ్డంతా బురదమయంగా మారుతోంది. ఇళ్లలోకి వెళ్లాలంటే బురద నీటిలో నుంచే వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని తండావాసులు వాపోతున్నారు. బైక్‌లపై వెళ్తుంటే అదుపు తప్పి కింద పడిపోతున్నామని పేర్కొంటున్నారు. డ్రెయినేజీలు ఉన్న చోట వాటిని శుభ్రం చేయకపోవడంతో వాటిలో మట్టి నిండిపోయిందన్నారు. దుర్గంధం నెలకొంటోందని, దోమల బెడదను భరించలేకపోతున్నామని వాపోయారు. తండాలో నెలకొన్న సమస్యలపై స్పందించే వారే కరువయ్యారని వారు వాపోతున్నారు. సమస్యలపై జీపీలో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవోను తండావాసులు కోరుతున్నారు.

నడవడానికి ఇబ్బందిగా ఉంది



మా తండాలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. డ్రెయినేజీలు, రోడ్లు లేవు. వర్షం నీరు, మురుగు నీరు రోడ్లపై నిలిచిపోతుండటంతో నడవడానికి ఇబ్బందిగా ఉంది. ఉన్న డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదు. దుర్గంధం నెలకొంది. తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

– కోటేశ్వర్, తండావాసి

మోడల్ స్కూల్‌లో విద్యార్థి ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు



ఎన్నికల్లో అధికారులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ లో గురువారం విద్యార్థి ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పి.దశరథ్ తెలిపారు. రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి కొందరు విద్యార్థులను పోలింగ్ ఆఫీసర్లు, ఏజెంట్లు, కలెక్టర్, ఎస్పీగా నియమించారు. స్కౌట్ విద్యార్థులు కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తించారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ దశరథ్ మాట్లాడుతూ.. ఇలాంటి ఎన్నికల ద్వారా విద్యార్థులు ఓటు విలువను తెలుసుకుంటారని భవిష్యత్తులో ప్రజాస్వామ్యంపై అవగాహన పెరుగుతుందన్నారు. సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు చిత్రలేఖ, గంగా ప్రసాద్, సతీశ్, అమూల్య, పీడీ సంజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



చంద్రశేఖర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్



ఆలయం పక్కన చెత్త వేసిన దృశ్యం

నిజామాబాద్ రూరల్: ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ స్థానికులకు సూచించారు. గురువారం రూరల్ పీఎస్ పరిధిలోని చంద్రశేఖర్‌కాలనీలో స్థానిక హనుమాన్ ఆలయం, దుర్గాదేవి కాలనీవాసులు హనుమాన్ మందిరం వద్ద చెత్తను వేస్తున్నారని కాలనీవాసులు ఎస్‌హెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కాలనీకి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో చెత్తవేయడం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎవరైన ఆలయ ప్రాంగణంలో చెత్తవేస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

మానవత్వం చాటిన సేవా సంస్థ సభ్యులు



నిజామాబాద్ నాగారం: అనారోగ్యంతో మతిస్థిమితం కోల్పోయి మల మూత్రాలు చేసుకుంటు దయనీయ స్థితిలో ఉన్న అనాథలకు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గురువారం సపర్యలు చేశారు. పెరిగిన వెంట్రుకలు, గడ్డం కత్తిరించి, శుభ్రంగా స్నానం చేయించి కొత్త దుస్తులు వేశారు. వీరికి పలుచోట్ల గాయాలు ఉండడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒకటో టౌన్ పీఎస్, రైల్వే పోలీస్ సిబ్బంది సేవా సంస్థ సభ్యులకు సహకరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, కోశాధికారి జయదేవ్ వ్యాస్, జంగం రాజు, సుజాత, లాస్య తదితరులు పాల్గొన్నారు.

మురికినీటిలో గంబూసియా చేపల విడుదల



నిజామాబాద్ సిటీ: నగరవాసులకు దోమల బాధ నుంచి విముక్తి కలిగించేందుకు బల్దియా అధికారులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. మురికినీరు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూసియా చేపలను విడుదల చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని గంగాస్థాన్, మారుతినగర్, ముబారక్‌నగర్ తదితర కాలనీల్లో మురికినీరు నిలిచిన చోట గంబూసియా చేపలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షాదుల్లా హుస్సేన్, జవాన్లు ఈ చేపలను విడుదల చేశారు. మురికి నీటిలో వేసిన చేపలు దోమలను, దోమల గుడ్లను తింటాయని దీంతో దోమలు నియంత్రణ తగ్గుతుందన్నారు. త్వరలోనే వీటిని నగరంలోని అన్ని ప్రాంతాల్లో విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



జక్రాన్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న తమ్ముడు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్, నాయకులు చింత మహేశ్, డీకొండ శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, శక్కరికొండ కృష్ణ, పద్మారావు, బాదావత్ శంకర్ నాయక్, కొండూరు మాజీ సర్పంచ్ అశోక్ కుమార్, అన్నం సాయిలు, బానోత్ గోపాల్ నాయక్ తదితరులు ఉన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక



సిరికొండ: సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య గురువారం తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో సల్ల చైత్ర, లక్ష్మీప్రార్థన ఎంపికయ్యారని ఆయన తెలిపారు. నవోదయకు ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మోపాల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం వసంత సూచించారు. గురువారం మండలంలోని సిర్పూర్ ప్రాథమిక పాఠశాలలో ముదక్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది గోవర్ధన్, మధు, ఉపాధ్యాయులు గంగాప్రసాద్, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో జనరల్ స్టడీస్‌పై..



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు జనరల్ స్టడీస్ పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. విద్యార్థులకు చరిత్ర, రాజకీయాలు, కరెంట్ అఫైర్స్ వంటి విషయాలపై వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. కార్యక్రమంలో చరిత్ర శాఖ అధ్యక్షుడు రమేశ్ గౌడ్, ఐక్యూ ఏసీ సమన్వయకర్త ప్రభాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాం, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాలలో..

నిజామాబాద్ అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో అకాడమిక్ సెల్ ఆధ్వర్యంలో గురువారం ఫిజికల్ సైన్స్, కామర్స్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన బీఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, వంటి కొత్త కోర్సులపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఇలాంటి కోర్సులకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.రంగరత్నం, కామర్స్ విభాగం అధిపతి వినయ్‌కుమార్, బీబీఏ అధిపతి రంజిత పవర్, పరీక్షల నియంత్రణాధికారి భరత్‌రాజ్, అకడమిక్ కోఆర్డినేటర్ నహేద బేగం, రాహుల్, వేణుగోపాల్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రాజేశ్, దండుస్వామి, పీడీ బాలమణి, ఎన్‌సీసీ అధికారి రామస్వామి, పి.రామకృష్ణ, డాక్టర్ జయప్రసాద్, రజిత, సుమన్, శ్రీనివాస్, సతీష్, సంతోష్, ప్రియాంక, శమంత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో వీధి కుక్కల స్వైర విహారం



కాలనీలో తిరుగుతున్న వీధి కుక్కలు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూత్ సభ్యులు, కాలనీవాసులు

- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని 13వ డివిజన్ సారంగాపూర్‌లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. పాఠశాల విద్యార్థులను సైతం వీధికుక్కలు వెంటాడుతున్నాయని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్న పిల్లలను బయటకు పంపాలంటనే భయమేస్తోందని స్థానికులు అంటున్నారు. కుక్కల బెడదను నివారించాలని స్థానికులతో పాటు సారంగాపూర్‌లోని శ్రీ వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు ఇటీవల కలెక్టర్ సముదాయంలోని మున్సిపల్ కమిషనర్‌కు వివేకానంద యూత్ అసోసియేసన్ సభ్యులు వినతిపత్రం అందించారు. వీధి కుక్కల బెడద నుంచి స్థానికులను కాపాడాలని కోరారు. స్పందించిన కమిషనర్ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కుక్కల నుంచి స్థానికులకు ఎలాంటి పెద్ద ప్రమాదాలు జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



వీధికుక్కలు రోడ్డుపై నడుచుకుంటు వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఇకనైనా పెద్ద ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలి.

– బోదాస్ సాయిరాం, శ్రీ వివేకానంద యూత్ అధ్యక్షుడు

భయంగా ఉంది



సారంగపూర్‌లో 13వ డివిజన్‌లో వీధి కుక్కలతో స్థానికులు తీవ్రంగా భయపడుతున్నారు. మహిళలు, చిన్నారులు వీధుల్లో తిరగాలంటేనే జంకుతున్నారు. సమస్యపై అధికారులు స్పందించాలి.

– పల్లపు అంజి, యూత్ ఉపాధ్యక్షుడు

15న మంత్రుల ఇళ్ల ముట్టడి



నిజామాబాద్ సిటీ: అంగన్‌వాడీల సమస్యలపై ఈనెల 15న మంత్రుల ఇళ్ల ముట్టడి చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. 15న చేపట్టే కార్యక్రమాలను అంగన్‌వాడీల సిబ్బంది, టీచర్లు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు దేవగంగు, స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, వాణి, లక్ష్మి, యమున, సుజాత, జరీనా పాల్గొన్నారు.

చెరువుకు గండి..పూడ్చి వేత

ధర్పల్లి: మండలంలోని గోవింద్‌పల్లి ఊర చెరువుకు చిన్న గండి పడడంతో ఇరిగేషన్ అధికారులు స్థానిక రైతులతో కలిసి గురువారం పూడ్చి వేశారు. ముందుగానే గండి ప్రదేశాన్ని గుర్తించిన అధికారులు ఇసుక బస్తాలను వేసి మట్టితో పూడ్చారు. గండి పడిన ప్రదేశాన్ని ముందుగానే గుర్తించడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని ఇరిగేషన్ ఏఈ రాంప్రసాద్ పేర్కొన్నారు.



సంక్షిప్తం

రూ. ఐదు లక్షల ఎల్‌వోసీ అందజేత



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన మేకల నిహారిక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. పేదకుటుంబానికి చెందిన నిహారికను చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్చారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి వైద్యఖర్చుల కోసం రూ. ఐదు లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని బాధితులకు గురువారం అందజేశారు. ఎల్‌వోసీ అందించిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబీకులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

ధర్పల్లి: ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న బోయినపల్లి ప్రభాకర్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికై హైదరాబాద్‌లో సత్కారం పొందినందుకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాం, రమేశ్‌గౌడ్, రవిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, గంగాధర్, సంజీవ్, శారద, పద్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ

మోపాల్: మండలంలోని కంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 400 నోట్‌బుక్స్, 200 పెన్నులను గురువారం వితరణ చేశారు. సంస్థ అధ్యక్షుడు తంగళ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు బాధ్యతగా బుక్కులు, పెన్నులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాలచారి, ఉపాధ్యాయులు రాఘవపురం గోపాలకృష్ణ, అరుణ శ్రీ, సంస్థ ప్రతినిధులు తొడుపునూరి రామ్మోహన్, బాలశేఖర్, రాజశేఖర్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాదేవి మండపానికి భూమిపూజ

నిజామాబాద్ రూరల్: నగరంలోని వివేకానంద కాలనీలో నెలకొల్పే దుర్గాదేవి మండపానికి లలితా దేవి ఆశ్రమ పురోహితుడు వేలేటి రాజేందర్ శర్మ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వివేకానంద వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు అట్లూరి మురళీకృష్ణ మాట్లాడుతూ.. కాలనీవాసులందరం కలిసికట్టుగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి చెరుకుల లక్ష్మణ్‌గౌడ్, కోశాధికారి తిరుపతి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

నిజామాబాద్ అర్బన్: బెస్ట్ అవైలెబుల్ స్కీంకు సంబంధించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌లో విద్యార్థులతో కలిసిన నిరసన కార్యక్రమం చేపట్టారు. గత మూడుళ్లుగా ఈ స్కీంకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.